కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌కు చెందిన టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీల ముఖ్య నాయకులు పలువురు కేఎల్‌ఆర్, భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు దుబ్బాక శేఖర్, టీడీపీ మాజీ అధ్యక్షుడు కోస్గి శంకర్, పొన్నాల తిరుమల్, వెంకటేష్,గౌడ్, రవికుమార్, పాషా, నాయక్, పటేల్, షఫీ తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

నాగోలు: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. నరేంద్ర మోదీ సుపరిపాలనకు ఆకర్షితులై ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన చిన్నం నరేష్, శీలం గోపి రంగా రెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు. వారికి మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. రవీందర్ గౌడ్, గణేష్ గౌడ్ , కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

మన్సూరాబాద్: మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, ప్రజల సమస్యలను గాలికొదిలేసిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.

రూ.4 లక్షలతో పెట్రోల్ బంక్ క్యాషియర్ పరారీ

నాగోలు: పెట్రోల్ బంకు హెడ్ క్యాషియర్ రూ.4 లక్షలతో ఉడాయించిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సాయినగర్‌లోని కైలాస్ ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంకు)లో కరీంనగర్‌కు చెందిన సతీష్ ఆరేళ్లుగా హెడ్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. అక్కడ పనిచేసే మరో క్యాషియర్ వీరేష్ సెలవుపై వెళ్లాడు. బ్యాంకుకు వరుస సెలవులు ఉంటే పెట్రోల్ బంకు కార్యాలయాలోనే డబ్బును భద్రపరుస్తారు. ఏప్రిల్ 27, 28 బ్యాంకు సెలవు కావడంతో 28 మధ్యరాత్రి దాటిన తర్వాత సతీష్ డబ్బు పెట్రోల్ బంకు కార్యాలయంలో భద్రపర్చానని, తాళం చెవులు కార్యాలయంలో ఉన్నాయని వీరేష్‌కు ఫోన్ చేసి చెప్పాడు. 29న ఉదయం మేనేజర్ యాదిష్టర్ రెడ్డి, వీరేష్‌లు కార్యాలయంలోని డబ్బును లెక్కిస్తే ఉండాల్సిన రూ.8 లక్షలో రూ.4 లక్షలు తక్కువగా ఉంది. బంకు మేనేజర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిలో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



అమూల్య (10/10) | సేనావత్ చరిత (10/10) | సనా ఫిర్దోస్ (9.8 జీపీఏ) | ఎం.విస్మిత (9.8) | పి. భవానీ (9.8)

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గణేష్ నగర్‌కాలనీలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల బార్కాస్–1 పాఠశాలలో 49 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 48 మంది ఉత్తీరులయ్యారు. 9.8 జీపీఏతో సనా ఫిర్దోస్ టాపర్‌గా నిలిచింది. మన్సూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 26 మంది ఉత్తీర్ణత సాధించారు. రాజీవ్‌గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 66 మంది పరీక్షకు హాజరుకాగా 51 మంది పాసయ్యారు.. అయేష తరన్నుం, జాజుగల్ల నీతిమా 9.5 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచారు. డివిజన్ పరిధి వివేకానందనగర్ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలలు షేక్‌పేట్, గోషామహల్, ముషీరాబాద్ పాఠశాలల్లోని 204 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరుకాగా 197 మంది ఉత్తీర్ణత సాధించారు. గోషామహల్ స్కూల్ విద్యార్థిని ఎం. విస్మిత, షేక్‌పేట్ స్కూల్ విద్యార్థిని పి.భవానీ 9.8 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారు. కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అమూల్య 10/10 జీపీఏ, హయత్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని నిత్యశ్రీ 9.7 జీపీఏ (మండల టాపర్), మలక్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థి ఆంజనేయులు 9.7, చైతన్యపురిలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులు సేనావత్ చరిత 10 జీపీఏ, ముదావత్ దివ్య 9.8 జీపీఏ సాధించారు.



ముదావత్ దివ్య (9.8) | ఆంజనేయులు (9.7) | నిత్యశ్రీ (9.7)

'నారాయణ' విద్యార్థుల విజయదుందుభి



సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నారాయణ ఉన్నత పాఠశాల, వనస్థలిపురం శాఖ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. 26 మంది విద్యార్థులు 10 జీపీఏ, 58 మంది 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం నారాయణ దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం హేమాంబర్, ఆర్ఐ రవి ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ భవాని, అకడమిక్ డీన్స్ స్వామినాథం, చైతన్య అభినందనలు తెలిపారు.

సత్తా చాటిన శ్రీఆదిత్య విద్యార్థులు



వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ ఆదిత్య ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల చైర్మన్ డా.కేఎస్‌వీ సుధాకర్ తెలిపారు. మొత్తం 58 మంది విద్యార్థులకు గాను అందరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ముగ్గురు 10 జీపీఏ, 26 మంది 9 జీపీఏకు పైగా సాధించారని ఆయన తెలిపారు.

మెరిసిన లోటస్ ల్యాప్ విద్యార్థులు



పదవ తరగతి ఫలితాలలో తమ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ వనస్థలిపురం, కమలానగర్, హయత్‌నగర్ బ్రాంచీల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించారని విద్యాసంస్థ చైర్మన్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 9 మంది విద్యార్థులు 10 జీపీఏ, 82 శాతం మంది 9 జీపీఏకు పైగా సాధించారని ఆయన తెలిపారు.

'నాగార్జున' విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు



వనస్థలిపురం: పదో తరగతి ఫలితాల్లో నాగార్జున విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మరోసారి తమ సత్తా చాటుకున్నారని విద్యా సంస్థల అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్ తెలిపారు. జీపీఏ 10కి 10 పాయింట్లు 50 మంది విద్యార్థులు, 9.8 పాయింట్లు 72 మంది, 9.7 పాయింట్లు 73 మంది, 9.5 పాయింట్లు 71 మంది, 9.0 పాయింట్లకు మించి 458 మంది సాధించారని ఆయన తెలిపారు. మంగళవారం వనస్థలిపురం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో 10 పాయింట్లు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు బహూకరించి అభినందించారు.నాగార్జున పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాతబస్తీలో బీఆర్‌ఎస్‌కే మైనార్టీల మద్దతు

హైదరాబాద్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

సైదాబాద్: మైనారిటీల సమగ్ర సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పటిష్టంగా అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని హైదరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అందువల్ల హైదరాబాద్‌లో మైనారిటీలు బీఆర్‌ఎస్‌కే తమ మద్దతు పలుకుతారని ఆయన అన్నారు. సోమవారం రాత్రి ఐఎస్‌సదన్ డివిజన్‌లోని సామ సరస్వతీ ఫంక్షన్‌హాల్‌లో యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి సామ సుందర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన



లింగోజిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్ రావు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమ వారం రాత్రి ఎల్‌బీనగర్ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్, సీఎం సోదరుడు ఎ.కొండల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, తులసి శ్రీనివాస్ పాల్గొన్నారు.